
సాక్షి బాపట్ల

బుధవారం । 1 । ఫిబ్రవరి । 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 2212 క్యూసెక్కులు విడుదల చేశారు. పలు కాలువలకు 2105 క్యూసెక్కులు విడుదల చేశారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 41.4867 టీఎంసీలు ఉంది. ఎగువ నుంచి 2000క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 2200 క్యూసెక్కులు వదులుతున్నారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా సోమవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

జిల్లాలో నలుగురు ఎస్‌ఐలు బదిలీ

బాపట్లటౌన్: బాపట్ల జిల్లాలో నలుగురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ జిల్లా పోలీస్ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా పనిచేస్తున్న కె. కమలాకర్‌ను మార్టూరు స్టేషన్‌కు బదిలీచేశారు. మార్టూరు స్టేషన్‌లో ఎస్‌ఐగా పనిచేసే ఎస్.వి.రవీంద్రరెడ్డిని వీఆర్‌కు బదిలీచేశారు. పర్చూరు స్టేషన్‌లో ఎస్‌ఐగా పనిచేస్తున్న జి.వి.చౌదరిని వీఆర్‌కు బదిలీచేశారు. జిల్లా వీఆర్‌లో ఉన్న ఎన్. చెంచుప్రసాద్‌ను పర్చూరు స్టేషన్‌కు బదిలీచేశారు.

నేడు వేదవ్యాసభగవానుని విగ్రహ ప్రతిష్టామహోత్సవం



అమరావతి: వేద వ్యాస భగవానుని దేవాలయ శిఖర కుంభాభిషేకం, విగ్రహ ప్రతిష్టా మహోత్సవం వైకుంఠపురం భవఘ్ని ఆరామంలో బుధవారం ఘనంగా నిర్వహించటానికి భారీగా ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ ప్రతిష్టా మహోత్సవాలలో భాగంగా మంగళవారం భవఘ్నిగురూజీ దంపతుల ఆధ్వర్యంలో ప్రతిష్టా మూర్తులకు విశేష నవకలశ ద్రవ్యస్నపన పంచగవ్యస్నపనము, గంధాధివాసం, అధివాసాంగ హోమాలు నిర్వహించారు. వేదవ్యాస భగవానుని విగ్రహానికి బుధవారం ఉదయం 9.23 గంటలకు యంత్రప్రతిష్ట, బింబ ప్రతిష్ట, కళాన్యాసం, మహాపూర్ణాహుతి, మూలాలయం, గోపుర, పరివారదేవతలకు కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు భవఘ్ని గురూజీ తెలిపారు. ప్రతిష్టామహోత్సవానికి వచ్చే వాహనాలకు గ్రామానికి రెండువైపులా పార్కింగ్ ఏర్పాట్లు చేసినట్లు అమరావతి ఎస్‌ఐ కోటేశ్వరరావు తెలిపారు. అమరావతి, గుంటూరు వైపు నుంచి వచ్చే వాహనాలను ఆర్‌సీఎం చర్చి దగ్గర, విజయవాడ వైపు నుంచి వచ్చే వాహనాలను కరకట్ట మీదుగా ఇసుకరీచ్ వద్ద పార్కింగ్ చేయాలన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సుమారు వందల మంది పోలీస్ సిబ్బందితో బందోబస్త్ ఏర్పాటు చేశామన్నారు.

ఇంటివద్దకే రేషన్ బియ్యం పంపిణీ

నరసరావుపేట: ఫిబ్రవరి మాసానికి సంబంధించిన రేషన్‌బియ్యం, నిత్యావసరాలు ఎండీయూ వాహనాల ద్వారా కార్డుదారులకు బుధవారం ఉదయం ఏడుగంటల నుంచే ఇంటివద్దకే వచ్చి పంపిణీ చేయటం జరుగుతుందని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి జి.మోహన్‌బాబు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సార్టెక్స్ తెలుపురంగు బియ్యం ఒక్కొక్కరికి ఐదు కేజీల చొప్పున, ఏఏవై కార్డుకు 35 కేజీల చొప్పున ఉచితంగా పంపిణీ చేయబడతాయన్నారు. కంది పప్పు తెలుపురంగు కార్డుదారులు, ఏఏవై కార్డుదారులకు ఒక్కింటికి కిలో చొప్పున, పంచదార తెలుపురంగు కార్డుదారులకు అరకేజి, ఏఏవై కార్డుదారునికి ఒక కేజీ పంపిణీ చేస్తారన్నారు. బియ్యం ఉచితంగానుు, పంచదార, కందిపప్పును నిర్ణీత ధరలకు పొందాలని అన్నారు. కార్డుదారులు బియ్యం, ఇతర నిత్యావసరాలు ఎవరికైనా విక్రయిస్తే కార్డు రద్దుచేస్తామని హెచ్చరించారు. కొనుగోలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జెడ్పీ సీఈవోగా మోహనరావు బాధ్యతల స్వీకారం



గుంటూరుఎడ్యుకేషన్: జెడ్పీ సీఈవోగా జె.మోహనరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు డీఎల్‌డీవోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న మోహనరావును జెడ్పీ డిప్యూటీ సీఈవోగా నియమించిన ప్రభుత్వం సీఈవోగా పూర్తి అదనపు బాధ్యతలను ఆయనకే అప్పగించింది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఈవో ఛాంబర్లో బాధ్యతలు స్వీకరించిన తరువాత సీఈవో (ఎఫ్‌ఏసీ)గా బాధ్యతలు చేపట్టారు.మోహనరావు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ దంపతులను జెడ్పీ అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మోహనరావుకు జెడ్పీ పరిపాలనాధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 567.20 అడుగుల వద్ద ఉంది. ఇది 249.5490 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 9,387, ఎడమకాలువకు 8,193, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 9,288, ఎస్ఎల్‌బీసీకి 2,400, వరదకాలువకు 320 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



గుంటూరులోని బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో నిక్ వుజిసిక్ ప్రసంగం వినేందుకు తరలివచ్చిన విద్యార్థిలోకం



ప్రసంగిస్తున్న నిక్ వుజిసిక్

గెలుపు మంత్రం

విద్యార్థి లోకానికి స్ఫూర్తి నింపిన అంతర్జాతీయ మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్

- సానుకూల దృక్పథంలోనే విజయం దాగి ఉంది
- లేనివి తలచుకుని కృంగిపోకండి ఉన్నవి చూసుకుని ఆనందించండి
- నా వైకల్యం ఎందరికో స్ఫూర్తినిచ్చినందుకు గర్విస్తున్నా
- కలల సాకారానికి కృషి చేస్తే ఎలాన్‌మస్క్ కంటే ఉన్నతంగా ఎదుగుతారు
- డబ్బుతో సాధించలేనివి కూడా ప్రేమ, మన్నింపు, ధైర్యంతో సాధ్యమే



నిక్ వుజిసిక్‌తో సీఎం సలహాదారు ధనుంజయరెడ్డి, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, లేళ్ల అప్పిరెడ్డి

ఏఎన్‌యూ: జీవితంలో అసాధ్యం అంటూ ఏమీ లేదని అంతా సాధ్యమేనని అంగవైకల్యం, అవరోధాలు ఉన్నత లక్ష్య సాధనకు అడ్డుకాదని అంతర్జాతీయ మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్ అన్నారు. గుంటూరులోని బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో మంగళవారం సాయంత్రం నిక్ విద్యార్థులకు ప్రేరణ ప్రసంగం చేశారు. సానుకూల దృక్పథంలోనే జీవిత విజయం దాగి ఉందన్నారు. నిన్ను నిందించిన వారిని తిరిగి నిందించవద్దని వారికి ప్రేమను పంచమని విద్యార్థులకు సూచించారు. మనకు లేనివి తలచుకుని కృంగిపోవద్దని, ఉన్నవి చూసుకుని ఆనందించాలని సూచించారు. నా అంగ వైకల్యం తలచుకుని నేనెపుడూ బాధపడనని ప్రతి రోజూ ఉదయం అద్దంలో నా అందమైన ముఖం, కళ్లు చూసుకుని ఆనందపడతానని, అవే నాకు ఎంతో స్ఫూర్తినిస్తాయన్నారు. నా వైకల్యం ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచినందుకు గర్విస్తున్నా అన్నారు. భారతదేశం ఎంతో సామర్థ్యం ఉన్న దేశమని మీరు అనుకుంటే ఏదైనా సాధించగలుగుతారన్నారు. భారతీయ యువకులకు ఉత్తమ పారిశ్రామికవేత్తలుగా ఎదిగే నైపుణ్య లక్షణాలు ఉన్నాయన్నారు. మీ కలల సాకారానికి అంకితభావంతో కృషిచేస్తే ఎలాన్‌మస్క్‌కంటే ఉన్నతంగా ఎదిగే శక్తి సామర్థ్యాలు మీలో ఉన్నాయని అన్నారు. ఇది సాధించలేనేమో అనే భయం, సందేహాలకు జీవితంలో తావివ్వొద్దని సూచించారు. డబ్బుతో సాధించలేనివి ఎన్నో ప్రేమ, మన్నింపు, ధైర్యంతో సాధించవచ్చని అన్నారు. 3,500లకుపైగా ప్రసంగాలు చేశానని, ప్రసంగించడం జీవితంలో నా కు దక్కిన గొప్ప అదృష్టంగా భావిస్తున్నానన్నారు.

విద్యార్థుల నినాదాలతో హోరెత్తిన ప్రాంగణం

నిక్ ప్రసంగంతో విద్యార్థులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. విద్యార్థుల నినాదాలు, చప్పట్లతో బ్రహ్మానందరెడ్డి స్టేడియం ప్రాంగణం మారుమోగింది. చాలా సందర్భాల్లో నిక్ అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు ఆనందంగా సమాధానం ఇచ్చారు. ప్రతి ఒక్కరిని ప్రేమిస్తానని, గౌరవిస్తామంటూ విద్యార్థులతో నిక్ ప్రతిజ్ఞ చేయించారు. బాపట్ల ఎంపీ నందిగం సురేష్, ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఫాతిమా తదితరులు హాజరయ్యారు.



నిక్ వుజిసిక్‌కు స్వాగతం పలుకుతున్న బాపట్ల ఎంపీ నందిగం సురేష్

ముఖ్యమంత్రిపై ప్రశంసలు

తన ప్రసంగంలో నిక్ ఆంధ్రప్రదేశ్‌పైన, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపైన ప్రశంసలు కురిపించారు. విద్య, విజ్ఞానానికి సీఎం ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని, ఇది ఎంతో మంచి పరిణామమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మంది ప్రముఖులను ఇప్పటి వరకు కలిశానని, కానీ వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో కలవబోవడం తన జీవితంలో ఎంతో ప్రత్యేకమన్నారు. ఎంతో అంకితభావం ఉన్న ప్రభుత్వం ఏపీలో ఉందని కితాబు ఇచ్చారు. ప్రపంచవ్యాప్తంగా 78 దేశాల్లో పర్యటించా, కానీ ఎక్కడా పొందని ప్రత్యేక అనుభూతి ఇక్కడ పొందానన్నారు. ఏపీలో పదో తరగతిలో తన జీవితంపై పాఠ్యాంశం విద్యార్థులకు ఎంతో ప్రేరణనిస్తుందన్నారు.

రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సీజ్‌చేస్తాం

- నిర్ణీత గడువులోపే రైతుల అకౌంట్‌లో నగదు జమ
- తేమ శాతం ఆధారంగానే కొనుగోలు
- ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో రూ.26.65 కోట్లు నగదు జమ
- రైస్‌మిల్లులు, వే బ్రిడ్జిలను ఆకస్మిక తనిఖీ చేసిన డీఎం వి.శ్రీలక్ష్మి



బాపట్లలో వే బ్రిడ్జి వద్ద ట్రక్ షీట్ జనరేట్ చేసే విధానాన్ని పరిశీలిస్తున్న డీఎం వి.శ్రీలక్ష్మి

బాపట్లటౌన్: రైతులను ఇబ్బందులకు గురిచేస్తే రైస్ మిల్లులు సీజ్‌చేస్తామని జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ వి.శ్రీలక్ష్మి హెచ్చరించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లోని వే బ్రిడ్జిల వద్ద ట్రక్ షీట్ జనరేట్ చేసేవిధానాన్ని, రైస్‌మిల్‌లో ధాన్యం లోడ్ దించే సమయంలో మిల్లర్లు ప్రవర్తిస్తున్న తీరును తెలుసుకునేందుకు మంగళవారం జిల్లాలోని బాపట్ల, చెరుకుపల్లి, కొల్లూరు, కర్లపాలెం మండలాల్లోని రైస్‌మిల్లులు, వే బ్రిడ్జిలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ తేమ శాతాల్లో వ్యత్యాసాలు చూపించి రైతుల నుంచి నగదు వసూలు చేస్తే మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నాణ్యత ప్రమాణాల మేరకు వ్యర్థాలు ఒక శాతం, రంగుమారిన ధాన్యం ఐదు శాతం కన్నా మించరాదన్నారు. ధాన్యం మిల్లులో దించిన రోజు నుంచి 21 రోజులలోపే వారి అకౌంట్‌లో నగదు జమ అవుతున్నాయన్నారు. మద్దతు ధర చెల్లించడంతోపాటు రవాణా ఖర్చులు సైతం వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో జమచేస్తున్నామన్నారు. జిల్లాలో మొత్తం 155 రైతు భరోసా కేంద్రాలు ఉండగా ఇప్పటివరకు 123 కేంద్రాల పరిధిలో కొనుగోళ్లు ప్రారంభమయ్యాయన్నారు. ఈ క్రాప్ ఆధారంగా రైతుల వద్ద నుంచి నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేయడంతో దళారుల ప్రమేయం లేకుండా చేయగలిగామన్నారు. జిల్లాలో మొత్తం 70 రైస్ మిల్లుల యజమానులు బ్యాంకు గ్యారెంటీ అందజేయటం వలన కొనుగోలులో మిల్లర్ల ప్రభావం లేకుండా చేశామన్నారు. మిల్లుల కేటాయింపు కూడా పారదర్శకంగా జరగడం, రవాణా చార్జీలు నేరుగా రైతుకే చెల్లించడంతో ఈ ఏడాది ధాన్యం కొనుగోలు సజావుగా, వేగవంతంగా సాగుతుందన్నారు. 1.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కొనుగోలు ప్రారంభమైన 27 రోజుల వ్యవధిలోనే 5261 మంది రైతుల నుంచి 37వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. రూ.78.18 కోట్లు జమ చేయాల్సి ఉండగా రూ.26.65 కోట్లు చెల్లించామన్నారు.

ఆర్డీగా డాక్టర్ యాస్మిన్

గుంటూరుమెడికల్:గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ)గా డాక్టర్ జొన్నలగడ్డ యాస్మిన్ మంగళవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఆర్డీగా పనిచేస్తున్న డాక్టర్ స్వర్ణ విజయగౌరి ఉద్యోగ విరమణ చేయడంతో స్టేట్ జాయింట్ డైరెక్టర్‌గా ఉన్న డాక్టర్ యాస్మిన్‌ను ఆర్డీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్డీగా విధుల్లో చేరిన డాక్టర్ యాస్మిన్‌ను ఆర్డీ కార్యాలయ డెప్యూటీ డైరెక్టర్ అంజయ్య, సూపరింటెండెంట్‌లు గోపవరపు స్టాన్లి రాజ్‌కుమార్, సుధీర్, సీనియర్ అసిస్టెంట్లు పాల్, అనిల్, ఏపీ ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్‌బాషా, జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, నర్సుల సంఘం నాయకురాలు యల్లంపల్లి పద్మజ, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది, నర్సింగ్ యూనియన్ నేతలు, నర్సింగ్ సిబ్బంది అభినందించారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రిపై నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిసాయి. చివరి రోజున శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి ఉదయం అవభృద స్నానం, చక్రతీర్థం కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం పుష్పయాగ కార్యక్రమం, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు.

ఉగాది నాటికి జగనన్నకాలనీలు ప్రారంభించాలి

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



బాపట్ల: ఉగాది పండుగ నాటికి జగనన్న కాలనీలు ప్రారంభించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్ ఆదేశించారు. గృహ నిర్మాణాలపై సంబంధిత అధికారులతో మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్లో ఆమె సమావేశం నిర్వహించారు. ఉగాది పండుగ నాటికి ప్రతి నియోజకవర్గంలో ఒక కాలనీలోని గృహ నిర్మాణాలన్నీ పూర్తిచేసి ప్రారంభించేలా చూడాలని అన్నారు. అధికారులే లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేయాలన్నారు. సుమారుగా 2,600 గృహాలు ప్రారంభానికి చక్కటి ప్రణాళిక రూపొందించుకోవాలని ఆదేశించారు. గృహ నిర్మాణాలకు అవసరమైన రుణ సదుపాయాన్ని బ్యాంకుల ద్వారా కల్పించడానికి డీఆర్‌డీఏ అధికారులు, సిబ్బంది సహకరించాలన్నారు. సుమారుగా 1,516 మంది లబ్దిదారులకు రుణాలు ఇప్పించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. రేపల్లె నియోజకవర్గంలో 2,290 మందికి రుణాలు ఇప్పించాల్సి ఉండగా ఇప్పటివరకు వంద మందికి కూడా రుణం ఇవ్వకపోవడంతో సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేమూరు నియోజకవర్గంలోను మూడు వారాలుగా లబ్దిదారులకు రుణాలు ఇప్పించలేకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అద్దంకి, బాపట్ల నియోజకవర్గాలలో గృహ నిర్మాణాలు ముమ్మరంగా సాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తూనే,... వారిని చైతన్య పరచాలన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు పనిచేయకపోతే పురోగతి ఎలా ఉంటుందని అన్నారు. గృహాలు నిర్మించుకునే వారికి రుణాలు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రభుత్వ భవనాల నిర్మాణం వేగం పెంచాలి

ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలలో పురోగతి కనిపించాలని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు చేపడుతున్న ప్రభుత్వ భవన నిర్మాణాలపై ఆమె సమీక్షించారు. పర్చూరు నియోజకవర్గంలో ఆరు భవనాలు ప్రారంభం కాకపోవడంపై ఆరా తీశారు. వేమూరు నియోజకవర్గంలో 12 భవనాలు పెండింగ్‌లో ఉన్నాయని, నాలుగు భవనాలు మరో దశకు చేరేలా నిర్మాణాలు చేపట్టాలన్నారు. బాపట్ల నియోజకవర్గంలో 20 భవనాలు మొదలు కాకపోవడంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. చినగంజాంలో 8, ఇంకొల్లులో రెండు భవనాలు నిర్మాణం జరగకపోవడం ఏమిటని ఇంజినీరింగ్ అధికారులను నిలదీశారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ, డివిజన్ ఇంజినీర్లు, డీపీఎంలు, ఏరియా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

పనిచేయని లిఫ్ట్, ఎస్కలేటర్‌లు



పని చేయని ఎస్కలేటర్

- వృద్ధులు, చిన్నారుల అవస్థలు
- చోద్యం చూస్తున్న డివిజన్ అధికారులు
- నెల రోజులుగా గుంటూరు రైల్వేస్టేషన్‌లో ఇదే దుస్థితి

లక్ష్మీపురం: గుంటూరు రైల్వేస్టేషన్‌లో నెల రోజులుగా రెండు లిఫ్టులు, ఎస్కలేటర్‌లు పనిచేయడం లేదు. ప్రయాణికులు అసౌకర్యాన్ని గురవుతున్నా డివిజన్ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. వివరాల్లోకి వెళితే... గుంటూరు రైల్వేస్టేషన్‌కు నిత్యం వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. రైల్వేస్టేషన్‌లో వృద్ధులు, వికలాంగులు సౌకర్యార్థం లిఫ్ట్, ఎస్కలేటర్‌లు ఏర్పాటుచేశారు. నెల రోజులుగా ఇవి పని చేయడం లేదు. ఈ విషయం సంబంధిత స్టేషన్‌మాస్టర్ నుంచి డివిజన్ అధికారుల వరకు సమాచారం తెలియజేసినా పట్టించుకున్న నాథుడు లేరు. గత్యంతరం లేక వృద్ధులు, మోకాళ్ల నొప్పులతో బాధపడే వారు, వికలాంగులు మెట్లనే ఆశ్రయిస్తున్నారు. ప్లాట్‌ఫారంపై గత కొన్ని రోజులుగా పనులు జరుగుతున్నాయి. మట్టి కుప్పలు ప్లాట్‌ఫారంపై ఉండటంతో వృద్ధులు, చిన్నారుల, మహిళలు, వికలాంగులు అసౌకర్యానికి గురవుతున్నారు. రైలు వచ్చిన సమయంలో మాత్రమే ఎస్కలేటర్ పనిచేస్తుందని మామూలు సమయంలో నిలిపి వేస్తు ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇప్పటికైనా డివిజన్ అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించడంలో శ్రద్ధ వహించాలని కోరుతున్నారు.



గుంటూరు రైల్వేస్టేషన్‌లోని 1వ నంబర్ ప్లాట్‌ఫారంపై పనిచేయని లిఫ్ట్

ఇద్దరు నకిలీ పోలీసుల అరెస్ట్



మాట్లాడుతున్న ఎస్‌ఐ సురేష్

వేటపాలెం: మండల పరిధిలో ఇద్దరు నకిలీ పోలీసులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై జి. సురేష్ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లిడించారు. చల్లారెడ్డిపాలెం పంచాయతీలోని రిక్షాల కాలనీకి చెందిన నక్క రమణారెడ్డి, కొత్త యానాది సంఘానికి చెందిన చలమచర్ల రాంబాబు, చీరాల వాడరేవుకి చెందిన దర్గా రావు నకిలీ పోలీసుల అవతారమెత్తారు. వీరు పోలీసు దుస్తులు ధరించి వేటపాలెం బైపాస్ రోడ్డుపై రాత్రి వేళల్లో వాహనాలు ఆపి వాహన చోదకులను బెదిరించి వారి వద్ద నుంచి నగదు, సెల్‌ఫోన్‌లను బలవంతంగా తీసుకోవడం మొదలు పెట్టారు. ఈ క్రమంలో ఈ నెల 25న బైపాస్‌లో బైక్‌పై వెళుతున్న చినగంజాం గ్రామానికి చెందిన వడ్ల మూడి వెంకటరావును ఆపి అతని వద్ద రూ. 700 నగదు లాక్కున్నారు. వీరిపై అనుమానం వచ్చిన వెంకటరావు వేటపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో విచారణ ప్రారంభించారు. నిందితులు కొంత కాలంగా రాత్రి వేళల్లో బైపాస్ ఎరోడ్డులో వాహన చోదకులు వద్ద బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. వీరిలో రమణారెడ్డి గతంలో కూడా అనేక నేరాలకు పాల్పడినట్లు తెలిసింది. నక్కా రమణా రెడ్డితో పాటు చలమచర్ల రాంబాబుని రిక్షాల కాలనీలో మంగళవారం అరెస్టు చేసి, బుల్లెట్ మోటార్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు దుర్గారావు పరారీలో ఉన్నాడు. వివిధ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్సై తెలిపారు.

మాజీ సైనికుల సంక్షేమానికి కృషి చేస్తాం

బాపట్ల: మాజీ సైనికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర సైనిక సంక్షేమశాఖ డైరెక్టర్ బ్రిగేడియర్(విశిష్ట సేవా మెడల్ గ్రహీత) వి.వెంకటరెడ్డి పేర్కొన్నారు. మాజీ సైనిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం సమావేశంలో నిర్వహించారు. సమావేశంలో వి.వెంకటరెడ్డి మాట్లాడుతూ మాజీ సైనికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి వాటి పరిష్కారానికి కృషి చేస్తుందని తెలిపారు. జిల్లా స్థానికలో వచ్చే సమస్యలపై ప్రత్యేక నివేదిక అందించాలని జిల్లా అధికారి గుణషిలాకు సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు, సంఘం సెక్రెటరీ తోట దుర్గారావు, కోశాధికారి పువ్వాడ యల్లమంద, గౌరవ సలహాదారులు అల్లావుద్దీన్, జెట్టి జోసెఫ్, నిజాంపట్నం యూనియన్ ప్రెసిడెంట్ సుల్తాన్, చెరుకుపల్లి ప్రెసిడెంట్ సుబ్బారావు, తెనాలి యూనియన్ ప్రెసిడెంట్ రాజు, చందోల్ యూనియన్ ప్రెసిడెంట్ దావూద్ పాల్గొన్నారు.

కందుకూరు డీవైఈఓ గుండెపోటుతో మృతి

కొండపి: కందుకూరు డీవైఈఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న పి.వెంకటేశ్వర్లు(59) సోమవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబంతో కలిసి కొండపిలో నివాసం ఉంటున్న ఆయన అర్ధరాత్రి సమయంలో అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు వెంటనే స్పందించి పొదిలి రోడ్డులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కొండపి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వెంకటేశ్వర్లు కందుకూరు డీవైఈఓ బాధ్యతలు నిర్వర్తిస్తూనే మర్రిపూడి మండలం తంగెళ్ల హైస్కూల్లో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. భార్య మంజూలాదేవితోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు ప్రస్తుతం అమెరికాలో ఎంఎస్ చేస్తున్నారు. ఆయన భౌతికకాయాన్ని స్వగ్రామమైన పల్నాడు జిల్లా ముప్పాళ్ల గ్రామం తరలించారు. విషయం తెలుసుకున్న పలువురు ఉపాధ్యాయులు ముప్పాళ్ల వెళ్లి నివాళులర్పించారు. మూడు దశాబ్దాలకు పైగా ఉపాధ్యాయుడిగా, ఎంఈఓగా, డీవైఈఓగా వెంకటేశ్వర్లు సేవలందించారు.

పెళ్లి సందడి



- జిల్లా వ్యాప్తంగా మొదలైన శుభకార్యాల హడావుడి
- నాలుగు నెలల పాటు భారీగా ముహూర్తాలు
- ఫంక్షన్ హాల్స్, కల్యాణ మంటపాలకు పెరిగిన గిరాకీ

శ్రీకారం చుట్టుకుంది పెళ్లి పుస్తకం.. ఇక ఆకారం దాల్చుతుంది కొత్త జీవితం.. అని సినీ కవి రాసినట్టుగా సాగుతోంది ప్రస్తుత పెళ్లిళ్ల సీజన్. మాఘమాసం రాకతో పెళ్లి ముహూర్తాలు మెండుగా ఉండటంతో సందడి మొదలైంది. ఫంక్షన్ హాల్స్, కల్యాణ మండపాలు, పురోహితులకు గిరాకీ పెరిగింది. ముందుగానే ఫంక్షన్ హాల్స్, కల్యాణ మండపాలను బుక్ చేసి పెట్టుకుంటున్నారు. పురోహితులకు ముందుగానే అడ్వాన్స్‌లు చెల్లిస్తున్నారు.

అద్దంకి: జనవరి మొదలు మార్చి వరకు ముహూర్తాలు మెండుగా ఉన్నాయని పురోహితులు చెబుతున్నారు. జనవరిలో 31 ఫిబ్రవరి నెల 8, 10, 11 12, 15, 16, 22, 23, 24, 25 మార్చి 1, 5, 8, 9, 10, 11 15, 17, 18, 22, 24, 26వ తేదీ వరకు పెళ్లిళ్లకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. ఈ తేదీలే కాకుండా మూడు నెలల్లో గృహప్రవేశం, గృహారంభం, ఉపనయనాది శుభకార్యాలకు యజమానికి కుదిరే విధంగా ముహూర్తాలున్నాయని పురోహితులు చెబుతున్నారు.

నెల ముందుగానే అడ్వాన్స్‌లు..

జిల్లాలోని అద్దంకి, బాపట్ల, చీరాల, పర్చూరు, వేటపాలెం, రేపల్లె, వేమూరు తదితర పట్టణాల్లోని కల్యాణ మండపాలను, ఫంక్షన్ హాల్స్‌ను నెల, నెలన్నర ముందుగానే బుక్ చేసుకున్నారు. దీంతోపాటు వంటవారికి, ఆర్కెస్ట్రా, పాట కచేరీలు, భాజాభజంత్రీలు, నాన్ ఏసీ, ఏసీ పెళ్లి మండపాలకు బాగా గిరాకీ పెరిగింది. ముందుగానే ఆయా పనులు చేసే వారికి చేతినిండా పని దొరుకుతోంది.

రూ.25 వేల నుంచి రూ.5 లక్షల వరకు మండపాలు..

ఫంక్షన్ హాల్, కల్యాణ మంటపాల్లో ఎవరి స్థాయికి తగ్గట్టుగా వారు రూ.25 వేల నుంచి రూ.5 లక్షల వరకు పెళ్లి మంటపాలు, సెట్టింగులు ఏర్పాటుకు ముందే అడ్వాన్స్‌లు ఇస్తున్నారని నిర్వాహకులు చెబుతున్నారు.

వివిధ రంగాల వారికి ఉపాధి

రెండేళ్లుగా పెళ్లికి వంటలు చేసే వారి దగ్గర నుంచి, పెళ్లి మండపాలు, పాట కచేరీలు, భాజీ భజంత్రీల వారికి కరోనాతో ఉపాధి కరువై నానా ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం కరోనా ప్రభావం లేకపోవడంతో ఆంక్షలు సడలించడం, ముహూర్తాలు బాగా ఉండటంతో ఆయా రంగాల వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా శుభకార్యాలకు మంచి ముహూర్తాలు ఉండటంతో శుభకార్యాల జోరందుకుంది.

ఒకటో తేదీ ముహూర్తాలకు మండపాలు కడుతున్నాం..

ఈ ఏడాది శుభకార్యాలు బాగానే ఉన్నాయి. గతేడాది ముహూర్తాలు లేక ఇబ్బంది పడ్డాం. రూ.50 వేల నుంచి రూ.2 లక్షలకు పైగా ధరతో మండపాలు ఏర్పాటు చేస్తాం.

– మస్తాన్, మండపాల సెట్టింగ్ వ్యాపారి

మార్చి వరకు ముహూర్తాలు..

ఈ ఏడాది మాఘ మాసం నుంచి ఫాల్గుణ మాసం వరకు అంటే ఈ నెల మొదలు, మార్చి వరకు మంచి మహుర్తాలు ఉన్నాయి. మిగిలిన శుభ కార్యాలకు మంచి ముహూర్తాలు ఉన్నాయి.

–తిలక్ పురోహితుడు

నదీ పరీవాహక భూములపై ఇరువర్గాల ఘర్షణ

- ముగ్గురికి గాయాలు
- తీర గ్రామాలలో ఉద్రిక్తత
- పోలీసు పికెట్ ఏర్పాటు



పెదలంక అరవింద వారధి సమీపంలో కొట్లాటలను అడ్డుకునేందుకు ఓ వర్గాన్ని అదుపు చేస్తున్న పోలీసులు

కొల్లూరు: నదీ పరీవాహక భూముల ఆక్రమణల విషయంలో రెండు వర్గాల మధ్య వివాదం చోటుచేసుకుంది. నదిలోని బుసక మేటలను స్వాధీనం చేసుకుని సాగు చేసుకునేందుకు ఓ వర్గం చేస్తున్న ప్రయత్నాలను మరో వర్గం అడ్డుకోవడంతో ఇరువర్గాల నడుమ మంగళవారం ఘర్షణలు చోటుచేసుకున్నాయి. మండలంలోని పెదలంక సమీపంలో అరవింద వారధి వద్ద కృష్ణా నదిలో బుసక మేటలను ఆక్రమించుకుని సాగు చేసుకునేందుకు సీపీఎం, రైతు, కౌలు రైతు సంఘాల నేతృత్వంలో పెదలంక, చింతర్లంక గ్రామాలకు చెందిన ఎస్సీలు పది రోజులుగా భూములు బాగు చేస్తున్నారు. అప్పట్నుంచి ఆ ప్రాంతంలో నది అంచున ఉన్న పంట భూముల్లోని రైతులు చెట్లను తొలగించి సాగు చేపడితే బుసక మేటలు నదీ ప్రవాహానికి కొట్టుకుపోయి పంట భూములు కోతలకు గురవుతాయని అధికారులకు పలు దఫాలు ఫిర్యాదు చేశారు. కృష్ణా నదిలోని భూములను ప్రభుత్వ అనుమతులు లేకుండా స్వాధీనం చేసుకునే ప్రయత్నాలను అడ్డుకోవడంలో ఆర్‌సీ(రివర్ అండ్ కన్జర్వేషన్), రెవెన్యూ, పోలీసు శాఖలు విఫలమయ్యారు. దీంతో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. నదిలోని భూములను మంగళవారం బాగుచేయాలని చింతర్లంక, పెదలంకకు చెందిన స్థానికులు, అడ్డుకోవాలని నది అంచున భూముల్లో వ్యవసాయం చేస్తున్న రైతులు సోమవారం రాత్రి సమావేశాలు నిర్వహించుకున్నారు. ఈనేపథ్యంలో మంగళవారం ఉదయం భూములు బాగుచేసేందుకు వెళుతున్న వర్గాన్ని అడ్డగించేందుకు రైతులు అరవింద వారధి వద్దకు చేరుకున్నారు. నదిలో భూములు బాగు చేయకుండా అడ్డుకునేందుకు రైతులు వచ్చిన సమాచారం తెలుసుకున్న బుసక మేటలు స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్న వర్గానికి చెందిన వారు అక్కడకి కొద్ది దూరంలో సమావేశమయ్యారు. ఇదే సమయంలో నదీ భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్న చింతర్లంక, పెదలంకకు చెందిన ముగ్గురు వ్యక్తులు ఆ భూముల్లోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో రైతులు అడ్డుకునేందుకు ప్రయత్నించగా వివాదం రేగి తోపులాట చోటుచేసుకుంది. తోపులాట జరగడంతో ఇరు వర్గాలకు చెందిన వందల సంఖ్యలో కత్తులు, కర్రలతో అరవింద వారధి వద్దకు చేరుకుని బాహాబాహీకి దిగేందుకు సిద్ధమయ్యారు. ఇదే సమయంలో అక్కడకి చేరుకున్న కొల్లూరు తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు, ఎస్‌ఐ శామ్యూల్‌రాజీవ్‌కుమార్ రెండు వర్గాలకు నచ్చచెప్పేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ రహదారిపై రెండు వర్గాలు సవాళ్లు, ప్రతి సవాళ్లకు దిగుతూ రెచ్చగొట్టుకునే ప్రయత్నాలకు దిగారు. తోపులాట అనంతరం భూములు స్వాధీనం చేసుకునేందుకు వచ్చిన వారు రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. కత్తులు, కర్రలతో ఇరు వర్గాలు అక్కడే మొహరించి దాడులకు పురిగొల్పుకునే పరిస్థితులు తలెత్తడంతో అప్రమత్తమైన పోలీసు ఉన్నతాధికారులు రేపల్లె, చుండూరు సీఐలు విజయచంద్ర, కల్యాణ్‌రాజ్‌లతో పాటు, పలు స్టేషన్‌లకు చెందిన ఎస్‌ఐలను, సిబ్బందిని ఘటనా ప్రాంతానికి తరలించారు. సుమారు రెండు గంటలపాటు రహదారిపై ఇరు వర్గాలను పోలీసులు వెనకకు వెళ్లగొట్టి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకున్నారు. రెండు వర్గాల మధ్య వివాదం మళ్లీ రాజుకునే అవకాశం ఉండటంతో భూ సంబంధిత వివాదాలకు అమలు చేసే 145వ సెక్షన్‌ను అమలు చేస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసరావు ప్రకటించారు. పోలీసులు ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా పికెట్ ఏర్పాటు చేశారు. అనంతరం భూములు స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్న చింతర్లంక, పెదలంకకు చెందిన వ్యక్తులతో సమావేశమైన చుండూరు సీఐ, తహసీల్దార్‌లు ప్రభుత్వం పట్టాలకు అనుమతిస్తే ఎస్సీలకు మొదట ప్రాధాన్యం ఉంటుందని, ఇతరులు మాటలు విని నదీ భూముల్లోకి వెళ్లవద్దని హితవు పలికారు. ఈ వ్యవహారంపై ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేస్తామని ఈ సందర్భంగా పోలీసులు పేర్కొన్నారు.

అది ఆత్మహత్య కాదు హత్యే!

- ఆస్తి కోసమే అక్కను హత్య చేసిన తమ్ముడు, అతని కుమారుడు
- నిందితులకు 14 రోజుల రిమాండ్



మృతురాలు సుబ్బాయమ్మ

సంతమాగులూరు (అద్దంకి): మండలంలోని అడవిపాలెం గ్రామంలో గత సంవత్సరం సెప్టెంబరు 21న ఉరి వేసుకుని మృతి చెందినట్లుగా గుర్తించిన గుదె సుబ్బాయమ్మది ఆత్మహత్య కాదని, హత్యేనని విచారణలో వెల్లడైనట్లు సీఐ శివరామకృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. సంతమాగులూరు పోలీసులు కేసును ఛేదించారని వివరించారు. మంగళవారం నిందితులిద్దరినీ అరెస్ట్ చేసి అద్దంకి కోర్టులో హాజరు పరచగా వారికి జడ్జి 14 రోజులు రిమాండ్ విధించినట్లు చెప్పారు. వివరాలు.. 76 ఏళ్ల వయసున్న మృతురాలు సుబ్బాయమ్మ 40 సంవత్సరాల క్రితం గుంటూరు జిల్లా శావల్యాపురం మండలం కనమర్లపూడిలోని, ఐదో తమ్ముడు పిచ్చయ్యను తీసుకుని వచ్చి పెంచి పెద్ద చేసింది. తనకు చెందిన భూమిలో ఆరు ఎకరాల భూమిని పిచ్చయ్య పిల్లల పేరుతో రాసింది. ఇది ఇలా ఉంటే 2020లో మృతురాలి భర్త మరణించాడు. అప్పటి నుంచి పిచ్చియ్య కుటుంబానికి, పెంచిన మృతురాలి కుటుంబానికి సఖ్యత లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో మృతురాలు తన వద్ద మిగిలి ఉన్న 3.5 ఎకరాల భూమిని మిగిలిన ముగ్గురు తమ్ముళ్ల పేర రాస్తానని, పిచ్చయ్యకు రాయనని చెబుతూ వచ్చింది. ఇక ఆమె ఆస్తి తమకు ఎలాగూ దక్కేలా లేదని భావించిన పిచ్చయ్య తన కుమారుడు రవితేజ సహాయం తీసుకున్నాడు. ఘటన రోజు రాత్రి, అక్కతో ఆస్తివిషయంలో ఘర్షణ పడ్డారు. ఆమె ససేమిరా అనడంతో కొట్టి.. తెల్లకాగితంపై వేలిముద్రలు తీసుకుని, ముఖంపై దిండుతో అదిమి స్పృహ లేకుండా చేశారు. తరువాత ఆమె చీరతో ఉరివేసుకున్నట్లుగా చిత్రీకరించి వెళ్లిపోయారు. పోస్టుమార్టంలో ఆమెది ఆత్మహత్య కాదు.. హత్యేనన్న విషయం వెలుగు చూడటంతో పోలీసులు వారి కదలికలపై నిఘా పెట్టారు. నిందితులు పిచ్చయ్య, అతడి కుమారుడు రవితేజ మంగళవారం అడవిపాలెం గ్రామ రెవెన్యూ అధికారి ద్వారా లొంగిపోయి, హత్య వివరాలు వెల్లడించారు. సమావేశంలో ఎస్‌ఐ నాగశివారెడ్డి పాల్గొన్నారు.

పరిశ్రమల అభివృద్ధికి అండగా ప్రభుత్వం

జిల్లా పరిశ్రమల శాఖాధికారి మదన్‌మోహన్

బాపట్ల టౌన్: పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుందని జిల్లా పరిశ్రమల శాఖాధికారి ఎస్.మదన్‌మోహన్ తెలిపారు. జిల్లాలోని పరిశ్రమల శాఖ కార్యాలయంలో జిల్లాలో ఏర్పాటు చేస్తున్న పరిశ్రమలపై మంగళవారం జిల్లా స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎస్.మదన్‌మోహన్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 685 పరిశ్రమలకు అనుమతులు పంపగా ఇప్పటికీ 670 అనుమతులకు సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా మంజూరు చేశామని పేర్కొన్నారు. జిల్లాలో మూడు క్లస్టర్లను ఏర్పాటు చేశారని వివరించారు. చీరాలలోని శంకర్ మెడికల్ హెల్త్ సర్వీసెస్ ఆర్గనైజర్, అద్దంకిలో కల్కి ఫ్యాబ్రికేషన్ క్లస్టర్ అసోసియేషన్, జంపనిలో భారత్ టెక్స్‌టైల్ క్లస్టర్ అసోసియేషన్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విజయవాడకు చెందిన ఏపీఎంఎస్‌ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు పారిశ్రామిక పార్కు కోసం 25 ఎకరాలు కేటాయించాలంటూ దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. సూక్ష్మ పరిశ్రమలకు పూర్తిగా సహకరిస్తామన్నారు. 3 నుంచి 5 ఎకరాల ప్రభుత్వ భూమిలో ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మించేందుకు చీరాలలోని ఆటోనగర్ ఏపీఐఐసీ గుంటూరు వారికి ఎన్‌ఓఎస్ జారీ చేశారన్నారు. చీరాలలోని ఆటోనగర్‌లో ఏపీఐఐసీలో ముగ్గురు షెడ్యూల్ కులాలు, ఒక మహిళ ఔత్సాహికులకు ప్లాట్లను కేటాయించామన్నారు. జిల్లాలో 655 పారిశ్రామిక అభివృద్ధి కోసం రూ.19.74 కోట్లు పెట్టుబడి రాయితీ, విద్యుత్ రాయితీ, వడ్డీ రాయితీ, స్టాంపు డ్యూటీ రాయితీలను కలెక్టర్ మంజూరు చేశారన్నారు. సమావేశంలో జిల్లా ఫిషరీస్ అధికారి సురేష్, ఎల్‌డీఎం నాయక్ పాల్గొన్నారు.

కోల్డ్ స్టోరేజ్‌పై రైతు ఫిర్యాదు



అన్నదాత కోల్డ్ స్టోరేజ్ వారు రైతుకు ఇచ్చిన బాండ్

శనగ పంట అమ్ముకున్నారంటూ ఆరోపణ

జే.పంగులూరు: మండల పరిధిలో కశ్యాపురంలోని అన్నదాత కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యం వారు తనకు తెలియకుండా పంటను అమ్ముకున్నారని ఓ రైతు మంగళవారం రేణింగవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే.. మార్టూరు మండలం ద్రోణాదల గ్రామానికి చెందిన నూల శ్రీరామమూర్తి 2018–19 సంవత్సరానికి గాను తన పొలంలో జేజేలు రకం శనగ బస్తాకు 60 కేజీలు చొప్పున 326 బస్తాలు అన్నదాత కోల్డ్‌స్టోరేజ్ నిల్వ చేశాడు. సదరు కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యం వారు నిల్వకు సంబంధించి 17 ఏప్రిల్ 2019న 155 నంబరు గల స్టోరేజీ బాండ్‌ను రైతుకు అందజేశారు. అంతేకాక జేజేలు 11 రకం బస్తాకు 60 కేజీలు చొప్పున 353 బస్తాలు కోల్డ్ స్టోరేజ్‌లో భద్రపరిచానని రైతు శ్రీరామమూర్తి తెలిపాడు. ఆ బాండ్ల ద్వారా తాను గుండ్లాపల్లిలోని సిండికేట్ బ్యాంక్‌లో రూ. 9.50 లక్షలు రుణం తీసుకున్నానని తెలిపాడు. అప్పటిలో శనగలకు సరైన ధర లేకపోవటంతో సరుకు అమ్ముకోలేక పోయానని చెప్పాడు. ఆ లోను కొంత చెల్లించానని.. కాగా సదరు బ్యాంక్ వారు మిగిలి ఉన్న బాకీ రూ. 4,51,500ను వడ్డీతో పాటు చెల్లించాలని పోయిన ఏడాది మార్చి నెలలో నోటీసు పంపించారని తెలిపాడు. బాకీ చెల్లించకుంటే కోల్డ్ స్టోరేజ్‌లో సరుకును వేలం వేస్తామని తెలిపారన్నాడు. ఆ వెంటనే తాను కోల్డ్ స్టోరేజ్ వద్దకు బ్రోకర్లను తీసుకొని వెళ్లి.. తన సరుకును చూపించాలని కోరగా యజమాని అందుబాటులో లేడంటూ పది నెలలుగా కాల యాపన చేస్తున్నారని.. సరుకు చూపించటం లేదని వాపోయాడు. కాగా ఈ నెల 24న బ్యాంక్ మేనేజర్ బాండ్లను తీసుకొని వాటి ప్రకారం కోల్డ్ స్టోరేజ్‌లోని సరుకును చూపించాలని కోరగా.. సరుకు లేదని తెలిసినట్లు రైతు చెప్పాడు. ఈ క్రమంలో కోల్డ్ స్టోరేజ్ సిబ్బందిని అడగగా, యజమాని సరుకు అమ్ముకున్నారని వారు తెలిపారు. ఈ క్రమంలో యజమని కూడా తప్పు అంగీకరించి.. సొమ్ము ఇస్తానని తెలిపాడు. ఈ క్రమంలో రైతు మంగళవారం స్థానిక రేణింగవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.



ఖాళీగా ఉన్న బ్లాకును పరిశీలిస్తున్న బ్యాంక్ మేనేజర్ (ఫైల్)